క్లుప్తంగా

పాఠశాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్‌రాజు

నింద్ర: మండలంలోని కావునూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ రాజు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం వడ్డించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులు హాజరు పట్టీ, రికార్డులను తనిఖీ చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

శ్రీరంగరాజపురం : మండలంలోని ముద్దుకుప్పం సచివాలయ పరిధి ఎన్‌టీఆర్ కాలనీ దళితవాడలో తలెత్తిన తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. సర్పంచ్ గిరిబాబు దగ్గరుండి బోరుకు మరమ్మతులు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా బోరు వేయించారని తెలిపారు. ఇటీవల ఆ బోరు రిపేరు కావడంతో సరిచేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శీనయ్య, కందస్వామి, హరి పాల్గొన్నారు.

బీఎస్పీ నేతకు పరామర్శ


నాగూర్‌కు పండ్లు అందిస్తున్న సెల్వమణి

నగరి : బీఎస్పీ జిల్లా కార్యదర్శి, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి నాగూర్‌ను రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి మంగళవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న నాగూర్‌ను ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్యస్థితిగతులు తెలుసుకున్నారు. పండ్లు అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, ఇళంగో, రమేష్ పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు

ఏర్పేడు :మండలంలోని పాపానాయుడుపేటలో ఓ మహిళపై తన భర్త వేధింపులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. ప్రసన్న కుమారి వికృతమాల సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయనిగా పని చేస్తోంది. ప్రసన్న కుమారికి రేణిగుంట మండలం, జీవాగ్రంలోని కేఎల్ఎం ఆస్పత్రికి చెందిన జీసీఎస్ సుకుమార్‌కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు.జీసీఎస్ సుకుమార్ తొట్టంబేడు మండలంలోని పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నిందితుడికి ప్రసన్న కుమారితో వివాహానికి ముందే మరో యువతితో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ప్రసన్న కుమారి అడిగినందుకు ఆమెను ఇటీవల నుంచి తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

అక్రమ రవాణాపై నిరంతర నిఘా


సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు

సత్యవేడు: ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాపై సరిహద్దుల వద్ద నిరంతరం నిఘా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధి కారి కేపీ నరసింహులు(డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ, తిరుపతి) అన్నారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల అధికారులతో ప్రత్యే క సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులురావు, ట్రైనీ డీఎస్పీ సింధు ప్రియ, శ్రీసిటీ డీఎస్పీ జేవీఎస్ పైడేశ్వరరావు పాల్గొన్నారు. ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల చెక్‌పోస్టు సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు, మారణాయుధాలు రవాణా కాకుండా చూడాలన్నారు. నియోజవర్గంలో ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని ఆదేశించారు. తహసీల్దారు రామాంజనేయులు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, బాలకృష్ణ, ఈశ్వరయ్య, భాస్కర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధితో సుపరిపాలన

- పేదల గుండెల్లో కొలువైన జగనన్న
- మేలు చేశామనిపిస్తేనే ఆదరించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు : రాష్ట్రంలో సంక్షేమ.. అభివృద్ధి పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం గంగాధర నెల్లూరు మండలం నందనూరు కలిజవేడు, పాపిరెడ్డిపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. బాణ సంచా, డప్పు వాయిద్యాల నడుమ గజమాలలతో స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగనన్న అహర్నిశలు శ్రమించారన్నారు. అనుక్షణం పేదల కోసం పరితపిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్ అని, చంద్రబాబు బీసీలను మోసం చేసి వెన్నుపోటు పొడుస్తున్నారని, కల్లబొల్లి మాటలు చెప్పి కుట్రలు చేయడానికి మళ్లీ తయారయ్యారని వివరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో కూడా చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశారు. దుష్టచతుష్టయంతో, కుట్ర దారులతో కూటమిగా ఏర్పడి సంక్షేమ ప్రభుత్వానికి అడ్డు వస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని చేసినా కపట నాటకాలు ఆడిన ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని, పేదల గుండెల్లో గూడు కట్టుకున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్ అని వెల్లడించారు.

నాన్న అడుగు జాడల్లో నడుస్తా

ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం జగనన్న తన ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో దాదాపు 99శాతం నెరవేర్చారని తెలిపారు. పేద ప్రజల ప్రగతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎంతో అభివృద్ధి చేశారని, మంచి పేరు తెచ్చుకున్నారని అదే బాటలో నడుస్తూ ప్రజా జీవితం కొనసాగిస్తానని


నందనూరులో కృపాలక్ష్మికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేత సురేష్ రెడ్డి

వెల్లడించారు. ప్రతి ఒక్కరూ అండగా నిలిచి సంక్షేమ సుపరిపాలనను మరో 30 ఏళ్లపాటు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైఎస్సార్‌సీపీ నేత సురేష్ రెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులుముని రాజారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ్మరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, మండల రైతు భరోసా కేంద్రాల అధ్యక్షుడు బలరాం బాబు రెడ్డి, కలిజవేడు సుబ్రమణ్యం రెడ్డి, పాపి రెడ్డిపల్లె సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు భారతి వెంకటేష్ రెడ్డి, నందనూర్ సర్పంచ్ మంజుల, పురుషోత్తంరెడ్డి, ప్రసాద్ రెడ్డి, చిట్టి బాబు, త్యాగరాజులురెడ్డి రఘునాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి , ప్రభాకర్ రెడ్డి,ఈశ్వర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, పట్టాభిరెడ్డి ,చంద్రా , డేవిడ్, పుష్ప రాజ్ పాల్గొన్నారు.

వడమాలపేటలో ఫ్లాగ్‌మార్చ్


సీతారామాపురంలో కేంద్రబలగాల కవాతు

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కేంద్రబలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సీఐ ఓబులేశు ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో సాయుధ బలగాలు పాల్గొన్నాయి. సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పటిష్ట భద్రత నడుమ పోలింగ్ జరుగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఉండదని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటేయవచ్చని తెలిపారు. ప్రజలకు ధైర్యం కల్పించేందుకే ఎస్వీఆర్‌పురం, ఎన్వీఆర్ కండ్రిగ, సీతారామాపురంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు.


సాయుధ బలగాలతో సీఐ ఓబులేశు

మాట ప్రకారం పెంచిన పింఛన్


సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్, తులసీయాదవ్

పాలసముద్రం : ఎన్నికల సమయంలో అవ్వాతాతలకు విడతల వారీగా రూ.3వేలకు పింఛన్ సొమ్ము పెంచుతామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్‌బాబు తెలిపారు. మంగళవారం సింహరాజపురంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు గ్రామస్థాయి నుంచి పకడ్బందీగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని కోరారు. గతంలో పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు నానా అవస్థలు పడేవారని, ఇప్పుడు ఇంటి ముంగిటనే వలంటీర్లు అందిస్తున్నారని, ఈ విషయాన్ని గుర్తు చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని స్పష్టం చేయాలని చెప్పారు. కింది నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడ అన్బళగన్, మాజీ సర్పంచ్ గణేష్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విజయరాఘవరెడ్డి, గోపాల్, రవిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాధ్యతగా విధుల నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలంలోని ఆశ కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ గర్భిణులకు సకాలంలో సేవలందించాలన్నారు. ప్రసవం వరకు వారికి అందు బాటులో ఉండాలని సూచించారు. వేసవి నేపథ్యంలో గర్భిణులు బయటకు వచ్చేప్పుడు గొడుగు వినియోగించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అవసరాలకు తగ్గట్టు ఉంచుకోవాలని స్పష్టం చేశారు. దోమలు వ్యాప్తిని నియంత్రించేందుకు మలాథిన్ మందును పిచికారీ చేయించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలోని ప్రసవం చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుశీల, మురళి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పెనుమూరు(కార్వేటినగరం) : వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చార్వాకానిపల్లెలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు యశోదారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తును చూపించి ఆదరించాలని అభ్యర్థించారు. ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని, ఎంపీగా రెడ్డెప్ప గెలిపించాలని కోరారు. ఈ క్రమంలో సాలమ్మ అనే మహిళ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నానని, డ్వాక్రా రుణం మాఫీ చేయడంతో లబ్ధి చేకూరిందని, తమ కుటుంబం ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటుందని వెల్లడించారు. కమలమ్మ అనే మహిళ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించే పెన్షన్ డబ్బులతో జీవనం సాగిస్తున్నానని, పిల్లలు ఆదరించక పోయినా పెద్దబిడ్డలా అండగా నిలుస్తున్న జగన్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమను ఆప్యాయంగా పలకరిస్తూ జగనన్నకు మద్దతు తెలుపుతున్నారని పార్టీ మండల కన్వీనర్ విజయకుమారెడ్డి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, మునికృష్ణారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, జయచంద్రారెడ్డి, నీలాపండరినాథ్, మహేష్, రవి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

పుత్తూరు: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని పార్టీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వడమాలపేట మండలం ఏఎంపురం పంచాయతీలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి ఆర్‌కే రోజా గెలుపు నల్లేరుపై నడకేనని, అత్యధిక మెజారిటీయే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి బూత్‌లో మెజారిటీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని తెలియజేసి, ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ప్రతి వ్యక్తీ తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా, వారిని బూత్ వద్దకు తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి రూ.5.18 లక్షలు ఆదాయం


పిచ్చాటూరులో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పిచ్చాటూరు: వేలం పాట ద్వారా పిచ్చాటూరు పంచాయతీకి రూ.5.18 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓపీఆర్‌డీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో బస్టాండు, జంతు వధ శాల, దినసరి కూరగాయల మార్కెట్‌లకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా రూ.5.18 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆమె వెల్లడించారు. వేలం దక్కించుకున్న వారు 2024 ఏప్రిల్ 1 నుండి 31 మార్చి 2025 వరకు జంతువధ శాల, దినసరి కూరగాయల మార్కెట్‌పై హక్కులు కలిగి ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

కార్వేటినగరం : ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం విజయకుమార్ తెలిపారు. మంగళవారం వడ్డిండ్లు గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు చేసుకున్న వారు నిర్భయంగా ఓటేయాలని సూచించారు. ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తూ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, సంఘమిత్రలు, డ్వాక్రా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబలి సమర్పించారు. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారిని అర్చకులు సుప్రబాత సేవతో మేల్కొలిపారు. పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో విశేష అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం శ్రీకావేరిరాజుపురంవాసులు పూజా సామగ్రి, వివిధ పుష్పాలు, అంబలితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని అర్చకులు సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు నైవేద్యంగా సమర్పించిన అంబలిని సేవించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు.


విశేషాలంకరణలో అమ్మవారు


అంబలి సేవిస్తున్న భక్తులు

గడ్డి దగ్ధం


కాలిపోతున్న గడ్డి

ఏర్పేడు : మండలంలోని కుమ్మరికండ్రిగలో మంగళవారం వీరయ్య అనే రైతుకు చెందిన గడ్డి దగ్ధమైంది. వివరాలు.. వీరయ్య తన 4 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఒబ్బిడి పూర్తయిన తర్వాత గడ్డిని మోపులు కట్టి పొలంలోనే నిల్వ చేసుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు రూ.70వేల విలువైన గడ్డి పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బెదిరించి.. పచ్చ కండువా కప్పేశారు!


మాట్లాడుతున్న ముస్లిం నేతలు నసరుల్లా, మస్తాన్ తదితరులు

- మంత్రి రోజా వెంటే ఉంటాం
- పుత్తూరు ముస్లిం నేతలు

పుత్తూరు : మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరితే, మమ్మల్ని టీడీపీ నేతలు పచ్చ కండువాలు కప్పేసి పత్రికలకు ప్రకటనలు ఇచ్చారని ముస్లిం నేతలు నసరుల్లా, మస్తాన్, షరీఫ్, బదురుద్దీన్ మండిపడ్డారు. మంగళవారం రాత్రి పట్టణంలోని షాదీమహాల్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీని తాము ఎలా సమర్థిస్తామని ప్రశ్నించారు. పుత్తూరులో రూ.2.41 కోట్లతో షాదీమహాల్‌ను నిర్మించి మైనారిటీలకు అండగా నిలిచిన మంత్రి రోజా వెంటే ఎప్పటికీ ఉంటామని స్పష్టం చేశారు. నగరి మండలంలోని మీరాసాహెబ్‌పాళ్యాన్ని మంత్రి రోజా దత్తతకు తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు, బేరసారాలకు ఇకపై తాము తలొగ్గమని, వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రకటించారు. . సమావేశంలో మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహిన్ పాల్గొన్నారు.

లైంగికదాడికి యత్నం : కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని వికృతమాలలో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన సుహాసిని పుత్తూరు మండలం, వేణుగోపాలపురం గ్రామానికి చెందిన సురేంద్రను తమకు ఇవ్వాల్సిన నగదు అడిగింది. ఈ క్రమంలో మంగళవారం సురేంద్ర వికృతమాలకు వెళ్లి ఆమెను దూషించి, లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.